సంపుటి :02 సంచిక :136 పేజీలు :04
వెల ₹5
# అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
శుక్రవారం 18, జూలై 2025

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- గతం కన్నా మెరుగైన పథకాలు
- మంత్రి సీతక్క

02






## నేను లోకేశ్‌ను కలవలేదు

- ఒకవేళ కలిసినా తప్పేంటి ?
- నేను ఏది చేసినా బాజాప్తాగా చేస్తా..
- బేజాప్తాగా చేయను.. మీలాగా సంచులు మోయను
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపాటు

02



## సమస్యల జంక్షన్

### దశాబ్దాలుగా రైల్వే డివిజన్ డిమాండ్

తెలంగాణలో రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ కాజీపేట. కానీ, రైల్వే పరంగా జంక్షన్‌కు పెద్దగా ప్రాధాన్యం లేదనే విమర్శలు ఉన్నాయి. అమృత్ భారత్ స్కీంలో భాగంగా స్టేషన్ సుందరీకరణ పనులైనా చేపట్టలేదు. ప్రయాణికులు ఎంతో కాలంగా కోరుతున్న రైల్వే ఫ్లాట్‌ఫారాల పెంపు కూడా ఆచరణకు నోచుకోలేదు. ఇంత పెద్ద జంక్షన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలవడం లేదని, వాటికి హాల్టింగ్ ఇవ్వాలని ప్రయాణికులు కోరినా.. ఫలితం లేకపోయింది. అలాగే జంక్షన్ నిత్యం సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. అలాగే రైల్వే సబ్ డివిజన్ ఆసుపత్రిలో సరైన వసతులు లేక రైల్వే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఇలా కాజీపేట జంక్షన్‌కు సమస్యల నిలయంగా ఉంది. కొందరు ఉన్నతాధికారులు కావాలనే కాజీపేట జంక్షన్‌కు అడ్డుపడుతున్నారని, అందుకే జంక్షన్ అభివృద్ధికి నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. సికింద్రాబాద్ డివిజన్‌లోనే ఎక్కువ మొత్తంలో లాభాలు తెచ్చిపెట్టే కాజీపేట జంక్షన్‌ను రైల్వేశాఖ పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

-అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

- కేంద్ర రైల్వేశాఖకు విన్నతులు వెళ్లినా బుట్టదాఖలు
- నిరుపయోగంగా టౌన్ స్టేషన్
- అసౌకర్యంగా రైల్వే డివిజన్ ఆస్పత్రి
- సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు, రైల్వే సిబ్బంది విజ్ఞప్తి

03

**శనివారం కాజీపేటకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్**



## జూపార్క్‌కు తెల్లపులి

03



### ఎన్ క్లోజర్ లోకి విడుదల చేసిన మంత్రి

అక్షరదర్బార్, హనుమకొండ: హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ నుంచి తీసుకొచ్చిన తెల్లపులిని శుక్రవారం హనుకొండలోని కాకతీయ జూలాజికల్ పార్క్ లో నిర్మించిన టైగర్ ఎన్ క్లోజర్ లోకి ప్రజల సందర్శనార్థం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు.

ప్రముఖ కంపెనీ బ్రాండ్లతో

## నకిలీ ఎలక్ట్రికల్ గృహోపకరణాలు

- విక్రయిస్తున్న ఆరుగురు వ్యక్తులు అరెస్టు
- రూ.32 లక్షల నకిలీ ఎలక్ట్రికల్ వస్తువుల స్వాధీనం


04



## నాలుగు రోజులు భారీ వర్షాలు

ప్రజలారా జర జాగ్రత్త !

03



# పదవులు మనవే...

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు కరువు

### చల్లా ధర్మారెడ్డి

అక్షర దర్బార్, పరకాల: రాబోయే ఎన్నికలలో పదవులన్నీ బీఆర్ఎస్ పార్టీవే అవుతాయని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం పరకాల పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్లో పరకాల, నడికూడ మండలాల బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన





మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడుతో రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం పెట్టుకొని తెలంగాణ నీటి బొట్టును ఆంధ్రాకు తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "మన నీళ్ల కోసం మరో ఉద్యమం - ప్రజా పోరాటానికి తెలంగాణ సన్నద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి నేడు రాష్ట్రంలో నెలకొందని" పిలుపునిచ్చారు. కాంగ్రెస్ బోగస్ హామీలతో అధికారంలోకి వచ్చిందని, రేవంత్ రెడ్డి మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో ఆ పార్టీకి బుద్ధిచెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మోసపూరిత ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందని, మళ్లీ వీరి మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు కూడా దొరకరని అన్నారు. ప్రజాపాలన పేరుతో ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటడం ఖాయమని అన్నారు. ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఒక సైనికుడిలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యకర్తలు ఎవరి బెదిరింపులకు, కేసులకు భయపడాల్సిన పనిలేదు. "మీకు అండగా నేనుంటానని" తెలిపారు. కార్యక్రమం మొదలు నుండి చివరి వరకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు చప్పట్లు, ఈలలతో నూతన ఉత్సాహంతో సమావేశాన్ని నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

- మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- గతం కన్నా మెరుగైన పథకాలు
- మంత్రి సీతక్క



అక్షర దర్బార్, చిట్యాల: రాష్ట్రంలో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసే లక్ష్యంతోటే రేవంత్ సర్కార్ ముందుకు సాగుతోందని పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి సీతక్క స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో చిట్యాల మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి సంబరాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### గత ప్రభుత్వంపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విమర్శలు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు తలెత్తాయని, అయినప్పటికీ ఆ పరిస్థితులను ఎదుర్కొంటూ మహిళా సాధికారత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క సహాయ సహకారాలతో భూపాలపల్లిలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. గతంలో నియోజకవర్గాన్ని పాలించిన వ్యక్తి ప్రజల సొమ్మును దోచుకుంటూ, భూములను అక్రమించుకుని, ఇసుకను తరలించి కోట్లు గడించి, ఇప్పుడు ఇసుకను ఉచితంగా



అందిస్తుంటే ఆపాలని ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నియోజకవర్గంలోని పలు మండలాలలో సెంటర్ లైటింగ్, మహిళా సంఘాల భవనాలు, రోడ్లు మంజూరు చేయాలని మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

### మహిళా సంఘాలకు రుణ సాయం, బీమా సౌకర్యం

మహిళా సంఘాలలో సభ్యులుగా ఉండి ఇల్లు కట్టుకోలేని నిరుపేదలకు జిల్లా కలెక్టర్ ముందుగా రూ. లక్ష వరకు రుణాలు అందించే వెసులుబాటును కల్పించడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాలలో సభ్యులుగా ఉండి ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షలను చెల్లించడం జరుగుతుందని, సంఘాలలో సభ్యులుగా ఉండి అనుకోని పరిస్థితుల్లో చనిపోతే వారు తీసుకున్న రూ. 2 లక్షల రుణాలను ప్రభుత్వమే చెల్లించి మాఫీ చేపిస్తుందని చెప్పారు. ఇకనుండి 15 సంవత్సరాలు దాటిన యువతులతో పాటు 60 సంవత్సరాలు దాటిన మహిళలను కూడా మహిళా సంఘాలలో సభ్యులుగా చేర్చుకోవడం జరుగుతుందని సీతక్క తెలిపారు. మహిళా సంఘాలు స్థానికంగా లాభసాటి వ్యాపారాలను ఎంచుకొని సమిష్టిగా చేయాలని, అందుకు కావలసిన పరిస్థితులను ప్రభుత్వమే అందిస్తుందని హామీ ఇచ్చారు. మహిళా సంఘాలు బాధ్యతగా ఒంటరి మహిళలను ఆదుకుని వారికి అండగా నిలవాలి అన్నారు. ప్రభుత్వానికి మహిళలంతా అండగా ఉండాలని కోరారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక సంఖ్యలో గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మంత్రి సీతక్క చేతుల మీదుగా చెక్కుల పంపిణీ వడ్డీ లేని రుణాలకు సంబంధించిన రూ. 1.87 కోట్ల చెక్కును లబ్ధిదారులకు మంత్రి అందించారు. సంఘాలలో సభ్యులుగా ఉండే మృతిచెందిన 34 మంది కుటుంబాలకు రూ. 68 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఆర్టీసీకి అద్దె బస్సులను ఇచ్చిన మహిళా సంఘాలకు రూ. 4.20 లక్షల చెక్కులను అందించారు. రూ. 2 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను ఆయా లబ్ధిదారులకు సీతక్క చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రజిని, కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్డీఏ, సెర్ఫ్ అధికారులు, చిట్యాల, ములుగు మార్కెట్ చైర్మన్లు, గ్రంథాలయ చైర్పర్సన్, మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం: మంత్రి సీతక్క

అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ, సమాజాన్ని సృష్టించే మహిళ ఈ సృష్టిలోనే అత్యంత శక్తివంతురాలని అన్నారు. మహిళలంతా సంతోషంగా ఉండాలని, వారి చేతిలో నాలుగు పైసలు ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకుంటోందని, ఇందుకోసమే అంకితభావంతో పని చేస్తోందని తెలిపారు. మహిళలకు ఆర్థిక ఇబ్బందులు తొలగించేందుకు మహిళా సంఘాల సభ్యులకు రూ. 26 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందిస్తూ, వడ్డీ కోసం డబ్బులను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. మహిళలు ప్రభుత్వానికి అండగా ఉంటే, వారి కష్టాలను ప్రభుత్వమే తీరుస్తుందని హామీ ఇచ్చారు. ప్రతి మహిళ ఒక శక్తివంతురాలుగా ఎదగాలని, అందుకోసం అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడానికి రేవంత్ సర్కార్ దృఢ నిశ్చయంతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఇందుకోసమే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తూ, మహిళా సంఘాలకు బస్సులను నడిపించే బాధ్యతను కూడా అప్పగించడం జరిగిందన్నారు. మహిళలు వ్యాపారం చేసుకోవడం కోసం అవసరమైన షాపులను సైతం కేటాయింపులు జరుగుతాయని, ఇందిరమ్మ ఇళ్లు మహిళలకే ఇవ్వడం జరుగుతుందని, రేషన్ కార్డులు కూడా మహిళల పేరు మీదనే ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు.

# నేను లోకేశ్‌ను కలవలేదు

- ఒకవేళ కలిసినా తప్పేంటి ?
- నేను ఏది చేసినా బాజాప్తాగా చేస్తా..
- భేజాప్తాగా చేయను.. మీలాగా సంచులు మోయను
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మండిపాటు

అక్షరదర్బార్, ఖమ్మం: నేను ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కలవలేదు.. ఒకవేళ ఆయనతో కలిసి మాట్లాడితే తప్పేంటి..? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఏం చేసినా బాజాప్తా చేస్తానని, బేజాప్తా చేయాల్సిన కర్మ మాకు లేదు. అయినా నాకు తెల్వక అడుగుతా.. లోకేశ్ నీలాగా నేను సంచులు మోయను. లోకేశ్ నీలాగా చదువు రానోడు కాదు.. నేను లోకేశ్‌ను కలవలేదు.. కానీ కలిస్తే తప్పేంది?` అని నిలదీశారు. లోకేశ్ సీఎం రేవంత్‌రెడ్డి గురువైన ఏపీ సీఎం చంద్రబాబు కొడుకేనని, లోకేశ్ గూండా కాదు కదా.. అని ఎద్దేవా చేశారు. సీఎం ఢిల్లీకి వెళ్లి చీకట్లో కేంద్ర మంత్రి అమిత్ షా కాళ్లు పట్టుకుంటాడని, ప్రధాని మోదీ పాదాలకు ప్రణమిల్లి , తర్వాత వారిపై చిల్లర రాజకీయం చేస్తాడని విమర్శించారు. సీఎం ఇప్పటికైనా చిల్లర మాటలు మానుకోని, ప్రజలకు మంచి పాలన అందించాలని హితవు పలికారు.



## అనారోగ్యంతో మాజీ ఉపసర్పంచ్ మృతి



అక్షర దర్బార్, చిట్యాల: మండల కేంద్రానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కోడెల రాజయ్య (60) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేసిన రాజయ్య, హనుమాన్ దేవాలయం నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. అలాగే, రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడంలోనూ తనదైన ముద్ర వేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. రాజయ్య మృతి పట్ల పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



అక్షర దర్బార్, మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన ఆకుల ఓదెలు (63) అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో శుక్రవారం మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఓదెలు ఉదయం తన చేనులో కూరగాయలు కోస్తుండగా, చేనులో ఉన్న విద్యుత్ తీగ తగిలి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏడాది క్రితం మృతుని భార్య అనారోగ్యంతో మృతి చెంది, ఇప్పుడు అతడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు

# ఈనెల 21 న మంత్రుల రాక

అక్షర దర్బార్, రేగొండ: ఈనెల 21 వ తేదీన రేగొండ, గోరి కొత్తపల్లి మండల కేంద్రాలకు మంత్రులు రానున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే రేగొండ మండల కేంద్రంలో శ్రేష్ట బెంగుళూరు బేకరీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి తో ఎదగాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో ఈనెల 21 సోమవారం రేగొండ లో రూ.4 కోట్లతో నూతన బస్టాండ్, గోరి కొత్తపల్లి మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్,తదితర కార్యాలయాల నిర్మాణాల శంకుస్థాపన లకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, రెవిన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య లు రానున్నట్లు ఎమ్మెల్యే అన్నారు.మంత్రులతో గోరి కొత్తపల్లి మండల కేంద్రంలో మహాసభ ఏర్పాటు చేయనున్నట్లు ఈ సభకు ఉమ్మడి రేగొండ మండలం నుండి పదివేల పై చిలుకు జనాభాను తీసుకువచ్చి సభను విజయవంతం చేయవలసిందిగా మండల నాయకులను కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కటంగూరి రామ్ నర్సింహారెడ్డి, ఎన్ ఎస్సార్ సంపత్ రావు,జిల్లా వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, పిఎసిఎస్ చైర్మన్ నడిపల్లి విజ్జన్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య,జిల్లా,మండల నాయకులు పున్నం రవి, మోడెమ్ ఉమేష్ గౌడ్,కానుగంటి వీరబ్రహ్మం,గండి తిరుపతి, ఏనుగు రవీందర్ రెడ్డి,మైస బిక్షపతి,పట్టేం శంకర్, మటిక సంతోష్,తదితరులు పాల్గొన్నారు.



# నాలుగు రోజులు భారీ వర్షాలు !!

## – ప్రజలారా జర జాగ్రత్త !

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణవ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్న సంగతి తెలిసిందే. మరో నాలుగు రోజుల పాటు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని, అసవరమైతేనే బయటకు వెళ్లాలని సూచించింది. దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని హెచ్చరిస్తున్నది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. శని, ఆది, సోమవారాల్లో ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వర్షపు తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ప్రకటించింది.

# జూ పార్క్ కు తెల్లపులి..

## - ఎన్ క్లోజర్ లోకి విడుదల చేసిన మంత్రి





అక్షరదర్బార్, హనుమకొండ : హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ నుంచి తీసుకొచ్చిన తెల్లపులిని శుక్రవారం హనుకొండలోని కాకతీయ జూలాజికల్ పార్క్ లో నిర్మించిన టైగర్ ఎన్ క్లోజర్ లోకి ప్రజల సందర్శనార్థం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి విడుదల చేశారు. అలాగే జూలోని జంతువుల సమాచారం తెలుసుకొనుటకు ఏర్పాటుచేసిన క్యూఆర్ కోడ్స్, చాట్ బాట్, వన మహోత్సవం కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ గారు మాట్లాడుతూ... జూలోని జంతువులను దత్తత తీసుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, జూ పార్కును మరింత అభివృద్ధి చేయడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



# సొసైటీలను తనిఖీ చేసిన ఎంఏఓ శ్రీనివాస్



అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం పరకాల, మాదారం సొసైటీలను పరకాల మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. సొసైటీ గోదాంలో యూరియా నిల్వలను తనిఖీ చేసి సొసైటీ నుంచి రైతులకు యూరియా సరఫరాచేయడాన్ని పర్యవేక్షించి రైతులకు సకాలంలో యూరియా అందిస్తామని పేర్కొన్నారు. రైతులు ఎవరైనా ప్రైవేట్ డీలర్ గాని సొసైటీ ద్వారా గాని యూరియాను బ్లాక్ చేసినా, అధిక రేట్లకు అమ్మినా, లింకు పెట్టి అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు సొసైటీల ద్వారా 40 టన్నుల యూరియా సరఫరా చేశామని, ప్రస్తుత నిల్వ 40 టన్నులు ఉన్నట్లు పేర్కొన్నారు.

# కాటారంలో ఓపెన్ స్కూల్ సెంటర్..

## గోడ పత్రిక ఆవిష్కరించిన టీచర్లు



అక్షర దర్బార్, కాటారం : కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ పదో తరగతి, ఇంటర్మీడియట్ కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిందని ఈ అవకాశాన్ని రెగ్యులర్ గా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదవని విద్యార్థులు ఉపయోగించుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంకేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి తెలంగాణ ఓపెన్ స్కూల్ గోడ పత్రిక ఆవిష్కరించారు. అభ్యర్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 31వ తేదీ వరకు చెల్లించవచ్చని కనీస అపరాధ రుసుముతో వచ్చే నెల 12 వరకు చెల్లించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు దూరవిద్య కేంద్రం కోఆర్డినేటర్ సమ్మయ్య (94902 96561) అసిస్టెంట్ కోఆర్డినేటర్ బొల్లం సతీష్ (9951406567) ఉపాధ్యాయుడు బి.రాజు నాయక్(9441533642) లను సంప్రదించాలని కోరారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన..

## పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి

అక్షరదర్బార్, హనుమకొండ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 5వ డివిజన్ పరిధిలోని హనుమకొండ కొత్తూరుజెండాలో రూ.103 లక్షలతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన అనతికాలంలోనే పనులు చేపట్టేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. అన్ని డివిజన్లలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, అభివృద్ధికి ప్రజలు సహకరించాలని, రానున్న రోజుల్లో నియోజవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మొక్కలతోనే మానవుడికి ప్రాణవాయువు

**వరంగల్ ను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కంకణబద్ధులం అవుదాం**
**రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**



అక్షరదర్బార్, వరంగల్ : మానవాళికి ప్రాణవాయువు అందించే మొక్కలను పెంచే బాధ్యత మనమందరం తీసుకుందామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలల ప్రాంగణంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ 1951లో వన మహోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారని, అప్పటినుంచి ప్రతి సంవత్సరం జూలై మాసంలో వనమహోత్సవం నిర్వహిస్తూ గత సంవత్సరం 75 వసంతాలు పూర్తి చేసుకున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా 18 కోట్ల మొక్కలు నాటడమే ప్రతిష్టాత్మక వన మహోత్సవ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల పౌరులకు తల్లి పేరు మీద ఒక మొక్క నాటాలని చేసిన విజ్ఞప్తిని ప్రతిధ్వనిస్తూ మంత్రి అన్నారు. ముఖ్యంగా తల్లులు తమ పిల్లల పేర్ల మీద కూడా చెట్లు నాటాలని మంత్రి కోరారు. మనం మన సొంత పిల్లల మాదిరిగానే చెట్లను పెంచితే తెలంగాణ రాష్ట్రం మొత్తం ఆకుపచ్చ తెలంగాణ అవుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భయంకరమైన క్యాన్సర్ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులు పిల్లలకు విద్యార్థి దశ నుంచే ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు సింగిల్ యూస్ ప్లాస్టిక్ ను నివారించుటకు జిల్లా యంత్రాంగం, బల్దియా ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కల్పించుటకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ బల్దియా తరపున పెద్ద ఎత్తున అవెన్యూ , సెంట్రల్ మీడియన్, పార్కులలో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ స్థలాలు, చెరువులు కుంటలు ఆక్రమణలకు గురి కాకుండా పరిరక్షించే విధంగా మొక్కలు నాటడంతో పాటు పరిరక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీఎఫ్ ఓ అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, కార్పొరేటర్ పోశాల పద్మ, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, హార్టికల్చర్ అధికారులు రమేష్, లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు శారదాబాయి, వివిధ శాఖల అధికారులు, అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు పరశురాములు, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



అక్షర దర్బార్, పరకాల : వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బొక్క దయాసాగర్, హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీవీ రాజు గౌడ్, అంతడపుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కు టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్ దృష్టికి వర్కింగ్ జర్నలిస్టులు వృత్తిలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. చాలా మంది జర్నలిస్టులు దాదాపు దారిద్య్రరేఖకు దిగువన ఉండి ఈ వృత్తిని కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాలు, వివిధ అభివృద్ధి పనులను కథనాల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్తూ జర్నలిస్టులు తమ వృత్తి ధర్మాన్ని నెరవేరుస్తున్నారని గుర్తుచేశారు. జిల్లాలో గత 20 ఏళ్ళు గా జర్నలిస్టులకు నివాస స్థలాలు ఇవ్వలేదని కేవలం రెండు జర్నలిస్టు సొసైటీలకు ప్రభుత్వం భూమి కేటాయించిందని అది కూడా అన్యాక్రాంతం అవుతుందని దాన్ని కాపాడాలని కలెక్టర్ ను కోరారు. ఏ సొసైటీలో లేని జర్నలిస్టులకు కూడా నివేశన స్థలాలు అందజేయాలని ఇప్పటివరకు పూర్తయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లను వర్కింగ్ జర్నలిస్టులకు కేటాయించి వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులను అందజేయాలన్నారు. స్పందించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వం గతంలో రెండు సొసైటీలకు కేటాయించిన భూమిని అన్యక్రాంతం కాకుండా ఆర్డీవోలతో సమావేశం ఏర్పాటుచేసి కాపాడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ హనుమకొండ జిల్లా కోశాధికారి ఈసంపెల్లి రమేష్, సంయుక్త కార్యదర్శి ఈర్ల తిలక్, పశ్చిమ నియోజకవర్గం అధ్యక్షులు గీరెడ్డి అనిల్ రెడ్డి, కార్యదర్శి దామెర వెంకటేష్, సంపత్ రెడ్డి, అంకేశ్వరపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సూరారంలో నషా ముక్త్ భారత్ అభియాన్



అక్షరదర్బార్, హనుమకొండ : సూరారం గ్రామంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని, సమాజ శ్రేయస్సుకు ఎక్కడైనా మత్తు పదార్థాల వాడకాన్ని గమనిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1908, హెల్ప్ లైన్ నెంబర్ 14446 కు సంప్రదించాలని గ్రామ మహిళలకు, యువతకు కమ్యూనిటీ ఎడ్యుకేటర్ అలువాల తేజస్వీ చెప్పారు.

## కాటారం రైతుల గోస పుచ్చుకుంటున్న మంత్రి శ్రీధర్ బాబు..!

**నాట్లు కాకముందే యూరియా కోసం తిప్పలు పడుతాండ్లు**

**రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలి**

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

అక్షర దర్బార్, కాటారం : సొంత మండలమైన కాటారం మండల రైతుల గోస పుచ్చుకుంటున్న ఘనత ఐటీ మినిష్టర్ దుద్దిల్ల శ్రీధర్ బాబు కే దక్కుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు దుయ్యబట్టారు. శుక్రవారం కాటారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులను కలిసి వారితో మాట్లాడారు. రెండు మూడు రోజులుగా యూరియా కోసం లైన్‌లో నిల్చుంటున్నామని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ప్రాంత ప్రజల కష్టాలను, సమస్యలను ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు చెప్పినా స్పందించడం లేదన్నారు. ఇంత పెద్ద సమాజంలో ఎక్కువ సంఖ్యలో ఉన్న వ్యవసాయకూలీలు, రైతులు, కార్మికులు మూడు ఓట్లు ఉన్న మీ కుటుంబాన్ని అనేక మార్లు ఆదరించి అవకాశం కల్పించినా మా గురించి ఆలోచన చేయడం లేదని చెప్తన్నా పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు, ఎప్పుడుఓట్లు వచ్చినా కాటారం మండల ప్రజలకు దుద్దిళ్ల కుటుంబానికి వేలలో మెజార్టీ ఇస్తున్నారని, మెజార్టీ ఇచ్చే కాటారం ప్రజల గోస మంత్రికి పట్టదా అని ఆయన ప్రశ్నించారు. అధికారం, మంత్రి పదవి వచ్చేందుకు కారణమైన కాటారం ప్రజల గురించి ఎందుకు ఆలోచన చేయడం లేదన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడం మూలంగా ఇంకా పూర్తి స్థాయిలో వరి నాట్లు కాలేదని, ఈ సమయంలోనే రైతులు ఇలా క్యూలైన్‌లలో రోజుల తరబడి నిలబడితే నాట్లు పూర్తి అయితే ఇంకా పరిస్థితి ఎలా ఉంటుందోమంత్రి ఆలోచన చేయాలన్నారు. దేశంలో తమ కుటుంబానికే కోట్లు సంపాదించుకుని ప్రజలను గాలికివదిలేసే నాయకుడు ఎవరైనా ఉన్నారా అంటే అది కేవలం మంథని ఎమ్మెల్యే అని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సీజన్‌లో రైతులకు పచ్చిరొట్టే విత్తనాలు, పప్పు దినుసుల విత్తనాలు అందించడంలో ప్రభుత్వం విఫలం అయిందని విమర్శించారు.ఇప్పటికైనా ప్రభుత్వం, మంథని ఎమ్మెల్యే స్పందించి వరినాట్లు పూర్తయే సమయానికి రైతులకు సరిపడా యూరియను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జోడు శ్రీనివాస్, నాయకులు జక్కు రాకేష్, జక్కు శ్రావణ్, వంగల రాజేందర్ చారి, తదితరులు ఉన్నారు.






# సమస్యల జంక్షన్..

### రేపు రైల్వే మంత్రి పర్యటన..

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం కాజీపేట విచ్చేయనున్నారు. ఆయన పర్యటన అధికారికంగా ఖరారైనట్లు రైల్వే ఆధికారులు తెలిపారు. ఉదయం సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో ఆయన కాజీపేట వస్తారు. 12 గంటలకు చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో అయోధ్యపురానికి వస్తారు. అక్కడ నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్)ని సందర్శిస్తారు. మధ్యాహ్నం 2.45 గంటలకు తిరిగి కాజీపేటకు చేరుకుని ప్రత్యేక రైలులో సికింద్రాబాద్‌కు వెళ్తారు. ఆయన వెంట కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఇతర రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఉంటారు.

**రేపు కాజీపేటకు రానున్న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**దశాబ్దాలుగా రైల్వే డివిజన్ డిమాండ్**

**కేంద్ర రైల్వేశాఖకు విన్నతులు వెళ్లినా బుట్టదాఖలు**

**నిరుపయోగంగా టౌన్ స్టేషన్**

**అసౌకర్యంగా రైల్వే డివిజన్ ఆస్పత్రి**

**సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు, రైల్వే సిబ్బంది విజ్ఞప్తి**



అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : తెలంగాణలో రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ కాజీపేట. కానీ, రైల్వే పరంగా జంక్షన్‌కు పెద్దగా ప్రాధాన్యం లేదనే విమర్శలు ఉన్నాయి. అమృత్ భారత్ స్కీంలో భాగంగా స్టేషన్ సుందరీకరణ పనులైనా చేపట్టలేదు. ప్రయాణికులు ఎంతో కాలంగా కోరుతున్న రైల్వే ప్లాట్‌ఫారాల పెంపు కూడా ఆచరణకు నోచుకోలేదు. ఇంత పెద్ద జంక్షన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలవడం లేదని, వాటికి హాల్టింగ్ ఇవ్వాలని ప్రయాణికులు కోరినా.. ఫలితం లేకపోయింది. అలాగే జంక్షన్ నిత్యం సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. అలాగే రైల్వే సబ్ డివిజన్ ఆసుపత్రిలో సరైన వసతులు లేక రైల్వే సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఇలా కాజీపేట జంక్షన్‌కు సమస్యల నిలయంగా ఉంది. కొందరు ఉన్నతాధికారులు కావాలనే కాజీపేట జంక్షన్‌కు అడ్డుపడుతున్నారని, అందుకే జంక్షన్ అభివృద్ధికి నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. సికింద్రాబాద్ డివిజన్‌లోనే ఎక్కువ మొత్తంలో లాభాలు తెచ్చిపెట్టే కాజీపేట జంక్షన్‌ను రైల్వేశాఖ పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఈ ప్రాంతానికి డివిజన్ కావాల్సిందే..

తెలంగాణలో రెండవ అతిపెద్ద నగరమైన వరంగల్ జిల్లాలోని కాజీపేట జంక్షన్ ఉత్తర, దక్షిణ రైల్వే మార్గాలను కలుపుతోంది. ప్రతి రోజు సుమారు 100 వరకు రైళ్ల రాకపోకలు సాగిస్తాయి.15 వేల మంది రైల్వే ప్రయాణికులు సగటున ప్రయాణిస్తారు. తద్వారా రోజుకు రూ.17 లక్షల ఆదాయం వస్తుంది. సింగరేణి, కొత్తగూడెం, బెల్లంపల్లి, బల్లార్ష గనుల నుంచి బొగ్గు రవాణాలో 40 శాతం ఆదాయంతో పాటు కాజీపేటలో ఎలక్ట్రిక్ లోకో షెడ్, డీజిల్ లోకో షెడ్ తో పాటు నూతనంగా కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం కూడా జరుగుతోంది. వాటికి కావాల్సిన స్థలం, నీటి సౌకర్యం, రోడ్డు రవాణా సౌకర్యం కూడా ఉంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన కాజీపేటను డివిజన్ ఉన్నతీకరిస్తే బాగుంటుందని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విశాఖపట్నం జోన్ ఏర్పాటు చేసింది. ఇదే ఒరవడిలో కాజీపేట డివిజన్ కూడా ఏర్పాటు చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు కోరుతున్నారు. భువనగిరి నుంచి న్యూఢిల్లీ వైపు బల్లారా వరకు, వరంగల్ మీదుగా కొండపల్లి వరకు, రామాగుండం మీదుగా మణుగూరు, మేడారంతోపాటు నూతనంగా నిర్మించే డోర్నకల్- గద్వాల, నష్కల్- హసన్‌పర్తి, నష్కల్- చింతలపల్లి రైల్వేలైన్లు కలిపే విధంగా డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనలు ఉన్నాయని, సికింద్రాబాద్ డివిజన్ ఉన్నతాధికారలు, కేంద్ర మంత్రులు తలుచుకుంటే వెంటనే డివిజన్ ఏర్పాటవుతుందని, వెంటనే ఆ మేరకు నిర్ణయం తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### టౌన్ స్టేషన్ ఉండి ఎందుకు ?

కాజీపేట టౌన్ సమీపంలో బైపాస్ ఆర్వోబీ కింద 2007లో టౌన్ స్టేషన్ అందుబాటులోకి వచ్చింది. కానీ, ఇక్కడ కేవలం భద్రాచలం రోడ్ బల్లార్షా వెళ్లే సింగరేణి రైలుకు మాత్రమే హాల్టింగ్ సౌకర్యం ఉంది. ఢిల్లీ నుంచి చెన్నై వైపు వెళ్లే అన్ని రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తే మంచి సౌకర్యం ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు. మెడికల్ కాలేజీ, నిట్, సాఫ్ట్వేర్ ఇంజనీర్లు చెన్నై, ఢిల్లీ వైపు ప్రయాణించడానికి మంచి సౌకర్యంగా ఉంటుంది.

కేవలం ఒక్క సింగరేణి కోసమే స్టేషన్ అన్నట్లు ఒకే రైలుకు హాల్టింగ్ సౌకర్యం కల్పించడంపై విమర్శలు వస్తున్నాయి. ఇదే కాకుండా ఈ టౌన్ స్టేషన్‌ను ఆధునీకరించి అన్ని అవకాశాలు ఉన్న ట్రయాంగిల్ ప్లాట్‌ఫారం నిర్మిస్తే ఢిల్లీ, చెన్నై రైళ్ల రాకపోకలకూ అనువుగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే రైల్వే కార్మికుల కోసం నిర్మించిన రైల్వే ఆసుపత్రి.. కేవలం సబ్ డివిజన్ ఆసుపత్రి మాత్రమేనని, వాటిలో అన్ని వసతులు కల్పించాలని కార్మికులు కోరుతున్నారు. కార్మికులు తమ మానసిక ఉల్లాసానికి మంచి క్లబ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

---

# నకిలీ ఎలక్ట్రికల్ వస్తువులు విక్రయిస్తున్న ఆరుగురు అరెస్టు

**రూ.32 లక్షల విలువైన ఎలక్ట్రికల్ గృహోపకరణాలు స్వాధీనం**

అక్షరదర్బార్, హనుమకొండ : వరంగల్, హన్మకొండ, కేయూసీ పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రముఖ కంపెనీ బ్రాండ్లలైన పాలీకాబ్, వీగార్డ్, గోల్డ్‌మెడల్, ఫినోలెక్స్, చార్‌భుజా, యాంఖర్, లీగ్రాండ్ కంపెనీలకు సంబంధించిన నకిలీ ఎలక్ట్రికల్ గృహోపకరణాలు విక్రయిస్తున్న అరుగురు వ్యక్తులను వరంగల్ టాస్క్‌ఫోర్స్ మట్టెవాడ, కేయూసీ, హన్మకొండ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. అరెస్టయిన నిందితుల నుంచి సుమారు రూ.32 లక్షల విలువగల నకిలీ ఎలక్ట్రికల్ గృహోపకరణాలు (కరెంటు వైర్లు, స్విచ్ బోర్డులు), ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పొనమారం చౌదరీ (పెడగపల్లి డబ్బాలు, హన్మకొండ), రాజ్‌పురోహిత్ బీరుసింగ్, (రామన్నపేట, వరంగల్), కాంతిలాల్ (పెగడపల్లి డబ్బాలు, హన్మకొండ), పురోహిత్ శ్రవణ్‌కుమార్, పురోహిత్ భరత్‌కుమార్, ఆమృత్ జైన్ (హైదరాబాద్)గా పోలీసులు గుర్తించారు. ఈ అరెస్టుకు సంబంధించి సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా శుక్రవారం వివరాలను వెల్లడించారు. వరంగల్ ట్రై సిటీ పరిధిలో నకిలీ ఎలక్ట్రికల్స్ వస్తువులను విక్రయించేందుకు నగరానికి ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు వరంగల్ పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ విభాగానికి అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీస్ స్టేషన్ పోలీసుల అధ్వర్యంలో వరంగల్ జేపీఎన్ రోడ్‌లోని మహేంద్ర ఎంటర్‌ప్రైజెస్, హన్మకొండ హనుమాన్ నగర్‌లోని శ్రీఆర్‌బుదా ఎలక్ట్రికల్స్ అండ్ సానిటరీ, కేయూసీ పరిధిలో కేయూ రోడ్డులోని సాయి గణేష్ ఎలక్ట్రికల్స్ షాపుల్లో ఒకే సమయంలో దాడులు నిర్వహించగా ప్రజలను మోసం చేస్తూ నాణ్యత లేని, ప్రముఖ కంపెనీ బ్రాండ్ల పేర్లతో నకిలీ ఎలక్ట్రికల్స్ వస్తువులైన కరెంటు వైర్లు, స్విచ్ బోర్డులను విక్రయిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. దీంతో పోలీసులు దాడులు జరిపిన మూడు షాపుల నుంచి పెద్ద మొత్తంలో నకిలీ ఎలక్ట్రికల్స్ గృహోపకరణాలు స్వాధీనం చేసుకున్నారని, ఇందులో మహేంద్ర ఎంటర్‌ప్రైజెస్‌లో సూమారు రూ.10లక్షల 37వేలు, శ్రీఆర్‌బుదా ఎలక్ట్రికల్స్, సానిటరీ దుకాణంలో రూ.44 వేలు, సాయి గణేష్ ఎలక్ట్రికల్స్ దుకాణంలో సుమారు రూ.20 లక్షల 70 వేల విలువగల నకిలీ ఎలక్ట్రికల్ గృహోపకరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు. ఈ మూడు దుకాణాలకు చెందిన యజమానులతో పాటు, నకిలీ సామాను విక్రయించేందుకు వచ్చిన నిందితుల్లో కేయూసీ పరిధిలో ఇద్దరు, మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరిని అరెస్టు చేయడం జరిగిందని, పోలీసులు అరెస్టు చేసిన నిందితుల్లో ఒకడైన పురోహిత్ భరత్ కుమార్‌పై హైదరాబాద్‌లో గతంలో మూడు కేసులు నమోదు కాగా, మరో ఇద్దరు నిందితులు పొనమారం చౌదరీ, కాంతిలాల్‌పై కేయూసీ, హన్మకొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతలో ఒకటి చొప్పున కేసులు నమోదు అయినట్లు డీసీపీ తెలిపారు.నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కబరిచిన వరంగల్ ఏఎస్పీ శుభం, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూధన్, హన్మకొండ ఏసీపీ నర్సింహరావు, టాస్క్‌ఫోర్స్ ఇన్ స్పెక్టర్ సార్ల రాజు, కేయూసీ, మట్టేవాడ, హన్మకొండ ఇన్ స్పెక్టర్లు రవికుమార్, గోపి, శివకుమార్, ఏఏఓ సల్మాన్ పాషా, టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ భానుప్రకాశ్, ఏఎస్ఐలు రాజేశ్వరీ, ఉప్పలయ్య, కానిస్టేబుళ్లు సురేష్, సురేందర్, సాంబరాజులను డీసీపీ అభినందించారు.






## పరిమితికి మించి రవాణా చేస్తే చర్యలు

**- ఎస్సై కొప్పుల తిరుపతిరావు**

అక్షరదర్బార్, వెంకటాపురం(నూగూరు) : పరిమితికి మించి ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని వెంకటాపురం ఎస్ఐ కొప్పుల తిరుపతిరావు పేర్కొన్నారు. మండలంలోని వీరభద్రవరం వే బ్రిడ్జి వద్ద శుక్రవారం ప్రొబేషనరీ ఎస్సై సాయి కృష్ణ, సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి ఇసుక లారీలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో అధికలోడుతో వెళ్తున్న రెండు ఇసుక లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, పరిమితికి మించి లారీల్లో రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

